# ఇన్‌లాండ్ లెటర్ కథలు

## గుణపాఠం

"వెనుక నుంచి రా" అంటూ ఇంకేదో అనబోయి డ్రైవరు, తడుముకుంటూ ఎక్కుతున్న ఆ యువకుడిని చూసి ఆగిపోయాడు. నల్లకళ్లద్దాలు పెట్టుకొని ఒక చేతికి స్టూడెంట్ బ్యాగ్ తగిలించుకున్న ఆ యువకుడు అప్పుడే ఖాళీ చేయబడిన పి.హెచ్‌సి. సీటులో కూర్చోబోతూ నిల్చున్న ప్రశాంతికి తగిలి పడిపోయాడు. తటాలున ఆమె అతని చేతిని పట్టుకొని సీటులో కూర్చోబెట్టింది జాగ్రత్తగా.

'థాంక్‌యూ' అని చెప్పి ఓ మూలకు ఒదిగి కూర్చున్నాడు. అమీర్‌ఖాన్‌లా స్మార్ట్‌గా వున్నతనికి, కళ్ళు లేకపోవడం బాధ కల్గించుతుంది చూసేవారెవరికైనా, సహజంగానే జాలి హృదయం కల్గిన ప్రశాంతికి కూడా పాపం అన్పించింది. అతనిని చూస్తే అతడు తీసుకున్న టికెట్‌ను బట్టి అతను కూడా ఆమె చదివే కాలేజీ అని తెలుసుకుంది.

బస్టాప్‌లో బస్‌దిగి రోడ్‌క్రాస్ చెయ్యడానికి ఎవరైనా సాయం చేస్తారేమోనని ఎదురుచూస్తున్న అతని, దగ్గరకు వెళ్లి "నేను రోడ్డు దాటిస్తాను రండంటూ" అతని చేతిని పట్టుకొని ముందుకు నడిచింది ప్రశాంతి.

"ఎక్స్‌క్యూజ్‌మీ! మిస్, మీ పేరు తెలుసుకోవచ్చా" అడిగాడా యువకుడు రోడ్డు దాటించిన తరువాత. 'నా పేరు ప్రశాంతి, డిగ్రీ ఫస్ట్ యర్‌లో నిన్నే జాయిన్ అయ్యాను" అంటూ సమాధాన మిచ్చిందామె.

"నా పేరు ఉత్తేజ్, డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాను, కాస్త కాలేజీ క్యాంటీన్ వరకు తీసుకువెళ్ళగలరా" అభ్యర్థించాడతను. అలాగేనంటూ అతని చేతిని పట్టుకొని క్యాంటీన్‌కి తీసుకువెళ్లి తిరిగి వెళ్ళిపోబోతుండగా,

"కాఫీ తాగుదాం రండి ప్రశాంతిగారూ" అని అతను ఆహ్వానించడంలో ఆగిపోయింది. కాఫీ తాగిన తరువాత అతను మరోసారి చెప్పిన థ్యాంక్స్‌ను చిరునవ్వుతో స్వీకరిస్తూ" క్లాసుకు టైమయింది మరోసారి కలుస్తానంటూ హడావిడిగా వెళ్లిపోయింది ప్రశాంతి.

"యూ ఆర్ గ్రేట్ యార్" అంటూ కోలాహలంగా అరుచుకుంటూ అతని ముందుకు వచ్చింది మిత్రబృందం. "జాయిన్ అయినరోజే కాలేజీబ్యూటీగా పేరు కొట్టేసిన ప్రశాంతితో కాఫీ తాగుతానని బెట్ కాసాను గెలిచాను." గర్వంగా అన్నాడు ఉత్తేజ్ 'నల్లకళ్లజోడు' తీసి పక్కనబెడ్తూ.

"రియల్లీ యూ ఆర్ ఏ హీరో" అంటూ పొగడ్తలతో ముంచెత్తారు ఉత్తేజ్ మిత్రబృందం.

"ఏరా ప్రశాంతితో నీ గ్రుడ్డివాడి పాత్రను కొనసాగిస్తావా? ఇంతటితో సరా? అడిగాడు పందెంలో ఓడిపోయిన వినోద్ కుతూహలం, ఈర్ష్య కలగలిపి.

"మీరే చూస్తారుగా పదండి" అంటూ క్లాసురూంకి దారి తీసాడు ఉత్తేజ్. బుక్స్ మరచిపోయి తీసుకుందామని తిరిగి వచ్చిన ప్రశాంతి, వాళ్ల పందెం సంగతి చాటుగా విని నివ్వెరపోయింది. మనిషిలోని మంచితనంతో ఆడుకోవడం భరించలేకపోయింది ప్రశాంతి. రేపేల్లాగైనా ఉత్తేజ్‌కి గుణపాఠం నేర్పాలనుకొని ఆలోచించుకుంటూ వెళ్లింది.

ప్రశాంతి మర్నాడు యథాప్రకారం ఉత్తేజ్‌ను రోడ్డు దాటించబోతున్నప్పుడు, ఒక స్కూలు కుర్రాడు స్పీడుగా పరిగెత్తుకుంటూ ఉత్తేజ్‌ను గుద్దుకుంటూ వెళ్లాడు. ఆ ధాటికి అతని నల్లకళ్లద్దాలు క్రిందపడి పగిలిపోవడమనే సంఘటన చకచకా జరిగిపోయాయి.

ఆ హఠాత్సంఘటనకు అతడు మొదట నిర్ఘాంతపోయినా వెంటనే తేరుకుని నిజంగానే కళ్లులేని వాడిలా, కళ్లు మూసుకుని ఆమె వెంట నడిచాడు తప్పనిసరి పరిస్థితులలో! "ఫ్రెండు పిలుస్తుంది, ఇప్పుడే వస్తాను కొంచెమిది పట్టుకుని మీరిక్కడే ఉండండి" అంటూ ఉత్తేజ్ చేతికి ఏదో ఇచ్చి రోడ్డుకి ఒక దగ్గర నిలబెట్టి వెళ్లింది ప్రశాంతి.

ప్రశాంతి వెళ్లి ఇరవై నిమిషాలపైనే అయింది ఇంకా రాలేదు. కళ్లు విప్పదామా వద్దా, అని ఉత్తేజ్ ఆలోచించుకుంటుండగానే కాళ్లముందు చిల్లలపైసలు పడ్తున్న శబ్దం, ఆ వెనువెంటనే నవ్వులు వినబడ్డాయి. ఏమిటా! అని ఉత్తేజ్ కళ్లు విప్పి చూసేసరికి రోడ్డున వెళుతున్నవాళ్లు, అతని చేతివంక చూస్తూ అతని ముందు చిల్లర పైసలు వేస్తున్నారు.

ఎదురుగా స్కూలు పిల్లవాడు, ప్రశాంతి, వాళ్ల ఫ్రెండ్స్‌తో కలిసి కడుపు చెక్కలయ్యేలా నవ్వుతున్నారు. తన చేతివంక చూసుకున్న ఉత్తేజ్‌కి "గ్రుడ్డివాడిని ధర్మం చెయ్యండి" అనే ప్యాడ్ కనబడింది.

అంతే సిగ్గుతో, అవమాన భారంతో అతని తల నేలకు వాలిపోయింది. వంచినతల ఎత్తకుండా కాలేజీలోకి వెళ్తున్న ఉత్తేజ్‌కి వెనకనుంచి నవ్వులు వినిపిస్తూనే వున్నాయి.

—పల్లి ఉమాప్రసాద్.

## పెళ్లి

"బాబూ నా మట వినరా! పెళ్లంటూ చేసుకుని సుఖపడాలంటే పల్లెటూరి అమ్మాయినే చేసుకో! అదీ పేదరికంలో పెరిగిన వాళ్లయితే మన కష్టాలు సుఖాలు అర్థం చేసుకోగలరు. మనమూ అంతంత మాత్రం వున్న వాళ్లమే' అంది తల్లి కొడుకు రవితో.

రవి తల్లి మాటలు పెడచెవిన పెట్టినవాడల్లా "నీకు తెలియదమ్మా! పల్లెటూరి అమ్మాయిలైతే చదువు సంధ్య వుండదు. మోటు ప్రవర్తన కలిగి వుంటారు. నాకు అంతగా నచ్చదు. నాన్నలేకపోయినా నీవేమో కష్టపడి డిగ్రీ దాకా చదివించావు. ఇప్పుడో అప్పుడో గవర్నమెంట్ టీచర్ పోస్టు వస్తుంది. మన హోదాకు తగినవిధంగానైన నీ కోడలు ఉండాలా వద్దా! అమ్మా దయచేసి నా పెళ్లి విషయంలో మాత్రం నిర్ణయం నాదే! నీవు ఏమి అనుకో వద్దు" అన్నాడు రవి తల్లిమీద కాస్తో కూస్తో అభిమానాన్ని కురిపిస్తూ.

రవి తన మిత్రబృందం ద్వారా, పరిచయమున్న వాళ్ల ద్వారా అప్పటికే యాభై పెళ్లిచూపుల దాకా చూశాడు. ఒకవిధంగా రవి అందగాడే కావడంతో దాదాపు చాలా మంది అమ్మాయిల్లో ఆశలు రేపాడని చెప్పాలి. కాబోయే భార్య గురించి ఊహల్లో తేలిపోతున్నాడే తప్ప ఎంతమంది అమ్మాయిల్ని చూసినా ఎవరినీ నచ్చడం లేదు.

రవి పెళ్లి జరిగింది.

అది మొదటి రాత్రి!

పాలగ్లాసుతో వచ్చి పక్కమీద కూచుంటుందనుకున్న సుధ పాలు ఇవ్వలేదు సరికదా దగ్గరికి కూడా రాలేదు.

మల్లెపూల మంచంపై కూర్చున్న తనే లేచి ఆమె దగ్గరికి వెళ్లాడు.

ఆమె దూరం జరగసాగింది.

"ఎందుకలా దూరం జరుగుతావు దగ్గరికి రా" అన్నాడు రవి చిలిపిగా.

'దూరం జరగక దగ్గరకి రమ్మంటావా నాకు మీరంటే ఇష్టం లేదు. నాకున్న అందానికి కనీసం ఒక మారుతీకారు, ఒక పెద్ద ఎస్టేట్, బంగళా, నౌకర్లు రోజుకు రకరకాల చీరలు, బంగారు నగలు, హోదానిచ్చే భర్త రావాలి అనుకున్నాను. అంతవరకు పెళ్లి కాకుండా అలాగే వుందామనుకున్నాను. కానీ ఇంతలో పెద్దలు బలవంతంగా మీతో నా పెళ్లి చేసారు.'

నో!నో!!

'ఇది మొదటి రాత్రి వ్యర్థం చేసుకో' గట్టిగా అన్నాడు రవి.

రవి కేకలు విని నిద్రలేచిన తల్లి రవి మంచం దగ్గరికి వచ్చి 'బాబూ' అని తట్టి లేపింది.

"హమ్మయ్యా! ఇది కలా" అని లేచి కూర్చుని గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు.

'ఏమయింది బాబూ'

'ఏంలేదమ్మా! నీకు నచ్చిన అమ్మాయిని చూడు, నీవు చెప్పినట్టే పెళ్లి చేసుకుంటాను' అన్నాడు రవి.

—పి.శివరామయ్య.